ప్రజాశక్తి
గురువారం 5 అక్టోబర్ 2023 5 విజయనగరం



'జగనన్నకు చెబుదాం'కు 46 వినతులు

ప్రజాశక్తి-రాజాం

మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం రాజాం ఎంపిడిఒ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా శాఖల అధికారులతో కలిసి 46 వినతులు స్వీకరించిన జెసి... వాటిని సకాలంలో పరిష్కరించి ప్రజల్లో ఈ కార్యక్రమం పట్ల విశ్వాసం పెంపొందించాలని ఆదేశించారు. రెవెన్యూ అంశాలపై 8, డిఆర్‌డిఎకు 9, గృహనిర్మాణానికి 9, మున్సిపల్ అంశాలపై 7, రోడ్లు భవనాలకు సంబంధించి 2, గ్రామీణ నీటిసరఫరా, ట్రెజరీ, జిల్లాపరిషత్తు, ఎక్సైజ్, ఎంఇఒ, ఉపాధిహామీ, పంచాయతీరాజ్ తదితర శాఖలకు సంబంధించి ఒక్కో వినతి వంతున అందాయి. ఇతర అంశాలపై మరో 3 వినతులు అందాయి. చీపురుపల్లి డివిజన్ ఆర్‌డిఒ అప్పారావు, రాజాం ప్రత్యేక అధికారి సుధాకర్, మండలస్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భవన నిర్మాణాలు వేగవంతం

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- కొత్తగా 27 వేల ఇళ్లు మంజూరు
- గురజాడ స్మారక భవనం నిర్వహణకు ప్రతినెలా రూ.10 వేలు
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- అజెండాలోని పలు అంశాలపై కీలక చర్చ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో చేపట్టిన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా పరిషత్తు సర్వ సభ్య సమావేశం నిర్ణయించింది. ఇందుకనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని అభిప్రాయపడింది. విజయనగరం, పార్వతీపురం ఉమ్మడి జిల్లాలో కొత్తగా 27వేల ఇళ్లను మంజూరు చేసినట్టు సమావేశంలో చర్చకు వచ్చింది. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టని పట్టాలను రద్దుచేసి, వాటిని అర్హులైన ఇతర పేదలకు కేటాయించాలని సమావేశంలో పలువురు సూచించారు. ముఖ్యంగా గురజాడ స్మారక భవనం నిర్మాణానికి జెడ్‌పి తరపున సహకారం అందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చేసిన విజ్ఞప్తి మేరకు నెలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసేందుకు సర్వసభ్య సమావేశం తీర్మానించింది.

జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జరిగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో పలు అంశాలు కీలక చర్చకు వచ్చాయి. తొలుత మహాకవి గురజాడ అప్పారావుకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కోలగట్ల విజ్ఞప్తి మేరకు గురజాడ స్మారక భవన నిర్వహణకు నెలకు రూ.10 వేలు చొప్పున కేటాయిస్తూ తీర్మానిస్తున్నట్లు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రకటించగానే హర్షధ్వానాలు మిన్నంటాయి. సభ్యులంతా చప్పట్లతో తీర్మానాన్ని ఆమోదించారు. గురజాడ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేందుకు మరిన్ని కార్యక్రమాలను చేపడతామని చైర్మన్ ప్రకటించారు. ఆయన రాసిన దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అనే పంక్తులు ప్రపంచానికి ఆదర్శమన్నారు. గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలను జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్ వివరించారు. గరుగుబిల్లి, బలిజపేట మండలాలను పార్వతీపురం విద్యుత్తు సబ్‌డివిజన్‌లో చేర్చినట్లు తెలిపారు. విజయనగరం మండలంలో మరో పిహెచ్‌సి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. వాలంటీర్ల జీతాల సమస్యతోపాటు పలు ఇతర సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అనంతరం గృహనిర్మాణం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులు, డిఆర్‌డిఎ, విద్య, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు.

ఉమ్మడి జిల్లాలో కొత్తగా సుమారు 27 వేల ఇళ్లను మంజూరు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జెడ్‌పి చైర్మన్ తెలిపారు. విజయనగరం జిల్లాలో 15,040 ఇళ్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 11,800 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు గృహనిర్మాణంపై జరిగిన సుదీర్ఘ చర్చలో తెలిపారు. ఇవన్నీ వ్యక్తిగత ఇళ్లు మాత్రమేనని, ప్రస్తుతం కాలనీల్లో ఇళ్లు మంజూరు చేయడం లేదని వివరించారు. ఇప్పటికే మంజూరై, నిర్మాణాన్ని ప్రారంభించని ఇళ్లను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తవారికి మంజూరు చేయాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు మాట్లాడారు. తమ ప్రాంతంలోని గృహనిర్మాణ పరిస్థితి, సమస్యలపై చర్చించారు. వారి సూచనలను పరిగణనలోకి తీసుకొని కొత్త ఇళ్ల మంజూరుకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని, రెండు జిల్లాలో హౌసింగ్ పీడీలను చైర్మన్ ఆదేశించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి కావాలి

ఉపాధి హామీ కింద చేపట్టిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను జెడ్‌పి చైర్మన్ ఆదేశించారు. వీటిని సత్వరమే పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అదనంగా నిధులను కేటాయించిందని, వాటిని సంబంధిత కాంట్రాక్టర్‌కు వెంటనే చెల్లించాలని సూచించారు. ఈ పనుల్లో విత్‌హెల్డ్, క్వాలిటీచెక్ కోసం నిధులను పెండింగ్ పెట్టకూడదని స్పష్టం చేశారు. ఇవే కాకుండా ప్రాధాన్యేతర పనులు, జిజిఎంపి పనులను కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఎమ్మెల్యేల ద్వారా ప్రతి మండలానికి రూ.60 లక్షలు విడుదల చేసిందని, జెడ్‌పిటిసిల వద్ద జెడ్‌పి నిధులు రూ.15 లక్షలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వాటిని సకాలంలో వినియోగించి, సిసి రోడ్లు తదితర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామినాయుడు, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉమ్మడి జిల్లాల జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షల అనంతరం పింఛను

ఆధార్ కార్డులో పొరపాటున వయసు తక్కువగా నమోదైన వారికి, వైద్య పరీక్షల అనంతరం అర్హులని తేలితే పింఛను మంజూరు చేసే అవకాశం ఉందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. దీనికోసం అటువంటి వారు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే, ఎంపిడిఒల ద్వారా దరఖాస్తులు వస్తాయని చెప్పారు. వారిని మెడికల్ బోర్డుకు పంపించి, వయసు నిర్ధారణ చేయనున్నట్లు వివరించారు. వారి వాస్తవ వయసు ఆధారంగా ఆధార్ కార్డును సవరించి, అన్ని అర్హతలు ఉంటే కొత్తగా పింఛను మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. అర్హత ఉండి, ఇప్పటికే పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నవారికి జనవరిలో కొత్త పింఛన్లు మంజూరవుతాయని చైర్మన్ చెప్పారు.

వంద శాతం ఇ-పంట నమోదు కావాలి

జిల్లాలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా, వంద శాతం ఇ-క్రాప్ నమోదు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. వ్యవసాయ శాఖపై జరిగిన చర్చ సందర్భంగా, ఇ-పంట నమోదులో తలెత్తుతున్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. భూములతో సంబంధం లేకుండా, సాగు చేసిన ప్రతి పంటా ఇ-క్రాప్‌లో నమోదు కావాలని జెడ్‌పి చైర్మన్ కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ కోసం పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి, మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు తెలిపారు. జిపిఎస్ ఉన్న వాహనాలను మాత్రమే ధాన్యం రవాణాకు వినియోగిస్తామని, గోనె సంచులను మిల్లర్లే సమకూర్చుకోవాల్సి ఉంటుందని వారు స్పష్టం చేశారు.

తప్పడు దరఖాస్తులపై అప్రమత్తం

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటు నమోదు, తొలగింపు ప్రక్రియలో భాగంగా కొంతమంది తప్పుడు దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉందని, అలాంటి వాటిపై అధికారులు, కింది స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి హెచ్చరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె పలు అంశాలపై సమీక్షించారు. రాజకీయ లేదా వ్యక్తిగత కారణాలతో కొంతమంది ఉద్దేశపూర్వకంగా వేరే వ్యక్తుల ఓట్లను తొలగించాలని దరఖాస్తులు సమర్పిస్తున్న సంఘటనలు ఇటీవల ఒక జిల్లాలో చోటు చేసుకున్నాయని గుర్తుచేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఇలాంటివి జిల్లాలో చోటు చేసుకోకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫారం-7 దరఖాస్తులను ఒకటికి రెండు సార్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు తేలితే కఠినమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన సంబంధిత లేఖ సారాంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అధికారులకు కలెక్టర్ వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించి కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికారులు భాగస్వామ్యం కావాలని చెప్పారు. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీల నుంచి సహకారం అవసరమని సూచించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత, విజయనగరం ఆర్‌డిఒ ఎం.సూర్యకళ, ప్రత్యేక ఉప కలెక్టర్లు సుదర్శన్ దొర, వెంకటేశ్వరరావు, పద్మలత, ఎఫ్‌ఎస్‌ఒ నూకరాజు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పైడితల్లమ్మ పందిరిరాట

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పైడితల్లమ్మ ఉత్సవాలు బుధవారం పందిరిరాట కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక మూడు లాంతర్ల వద్దనున్న చదురుగుడిలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 8 గంటలకు సుమారు వంద మంది పైడితల్లమ్మ మండల దీక్షలను చేపట్టారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కెఎల్ సుధారాణి.. వారికి దీక్ష వస్త్రాలను, మాలలను అందజేశారు. 9.30 గంటలకు చంద్రగిరి ఆవరణలో వేదమంత్రాల నడుమ అమ్మవారి పందిరి రాటను వేసి ఉత్సవాలు ప్రారంభించారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి పందిరిలాట ఉత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ సుధారాణి మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, కార్పొరేటర్లు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

పందిరిరాట వేస్తున్న మేయర్ విజయలక్ష్మి, ఇఒ సుధారాణి

హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్-19 హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలకు విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో బాల, బాలికలు హాజరయ్యారు. చెరో 16 మందితో బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఈ నెల 29 నుంచి కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్ర పోటీల్లో జిల్లా జట్లు పాల్గొంటాయని చెప్పారు. ఎంపిక పోటీల్లో హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

6, 7న ఖోఖో, కబడ్డీ ఎంపిక పోటీలు

ఈ నెల 6, 7 తేదీల్లో అండర్-19 స్కూల్ గేమ్స్ (ఇంటర్ విద్యార్థులకు) ఖోఖో, కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ ఎంపిక పోటీలకు హాజరయ్యే అభ్యర్థులు వారి ఆధార్ కార్డు,స్టడీ సర్టిఫికెట్లు తీసుకురావాలని తెలిపారు.

క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఇక నుండి ఇంజినీరింగ్ సిబ్బంది ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు ఆదేశించారు. ఇందులో భాగంగా బుధవారం వివిధ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. విటి అగ్రహారం, బిసి కాలనీలో నిర్మితమవుతున్న వాటర్ ట్యాంకు నిర్మాణాలను పరిశీలించారు. మజ్జిపేట, బిసి కాలనీలో సిసి రోడ్లు, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా బిసి కాలనీలో నిర్మితమవుతున్న సిసి రోడ్డు నాణ్యతా లోపాన్ని గమనించారు. తక్షణమే ఇంజినీరింగ్ అధికారులను పిలిచి సిసి రహదారి నిర్మాణ విషయంలో మరోసారి నాణ్యతా ప్రమాణాలను పునపరిశీలించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాలలో కొంతమేర ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. 24 గంటల్లోపు ఆక్రమణలు తొలగించే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ అమ్మాజీరావును ఆదేశించారు. రహదారులను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు కావడం ఇబ్బందికర పరిస్థితని కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. రహదారులపై ఆక్రమణలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇఇ శ్రీనివాసరావు, ఎసిపి అమ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

వంతెన నిర్మాణంలో వైఫల్యం

- పారాది బ్రిడ్జి కుంగడంతో ప్రయాణికులు, వాహనదారులకు పాట్లు
- దూరభారంతో ఇబ్బందులు
- నూతన వంతెన ఏర్పాటులో జాప్యం వల్లే సమస్య

కుంగిన వంతెన

ప్రజాశక్తి-బొబ్బిలి

పారాది వంతెన నిర్మాణంపై పాలకుల నిర్లక్ష్యం వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలకు శాపంగా మారింది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన వంతెనపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కుంగిపోయే స్థితికి చేరింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై వంతెనను బ్రిటిష్ పాలకులు 1934లో నిర్మించారు. ఆ వంతెనపై భారీ వాహనాలు సామర్థ్యానికి మించిన బరువుతో వెళ్లడంతో శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం వంతెన కుంగిపోవడంతో బ్రిడ్జిపైనుంచి ద్విచక్ర వాహనాలకు తప్ప ఆటోలు, కార్లు, లారీలు, బస్సులు, ఇతర భారీ వాహనాలకు అనుమతి ఇవ్వకుండా ట్రాఫిక్‌ను మళ్లించారు. దీంతో బొబ్బిలి నుంచి విజయనగరం వెళ్లాలంటే రెండున్నర గంటల సమయం పడుతుందని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంకంటే సుమారు గంట వరకు అదనంగా పడుతోంది. అత్యవసర వైద్యం కోసం వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

టిడిపి శంకుస్థాపన చేస్తే.. వైసిపి రద్దు చేసింది

పారాది వద్ద వేగావతి నదిపై నూతన వంతెనకు టిడిపి ప్రభుత్వం రూ.10.09 కోట్లు మంజూరు చేసింది. వంతెన నిర్మాణానికి 2017 జనవరిలో అప్పటి కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే సుజయకృష్ణ రంగారావు శంకుస్థాపన చేశారు. అప్పట్లో పనులు ప్రారంభం కాకపోవడంతో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత టెండర్లను రద్దు చేసింది. మళ్లీ వంతెన కోసం వైసిపి ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసినప్పటికీ నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

రూ.40 లక్షలు గంగపాలు

పారాది వంతెన బాగు చేసేందుకు వైసిపి ప్రభుత్వం రూ.40లక్షలు ఖర్చు చేసింది. గతేడాది వంతెన మరమ్మతులు పూర్తి చేశారు. ఆ సమయంలో వంతెన కింద నుంచి వేగావతి నదిలో డైవర్షన్ రోడ్డు వేశారు. తర్వాత కురిసిన వర్షాలకు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది. వంతెన మరమ్మతులు తూతూ మంత్రంగా చేయడంతో నేడు వంతెన కుంగిపోయే స్థితికి చేరింది. కొత్త వంతెన నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త బ్రిడ్జి నిర్మించాకే..

వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రమాదకరంగా ఉందని, కొత్త బ్రిడ్జి నిర్మించాకే ఈ మార్గంలో రాకపోకలు సాగించాల్సి ఉంటుందని ఆర్అండ్‌బి ఎఇఇ బికెఎ రాజు తెలిపారు. అందుకు సుమారు 18 నెలలు పడుతుందని, అప్పటివరకూ ట్రాఫిక్‌ను దారిమళ్లించాలని బొబ్బిలి డిఎస్‌పికి ఆయన లేఖ రాశారు.

సామర్థ్యానికి మించి..

బ్రిటిష్ కాలంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పారాది వంతెనను నిర్మించారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడంతోపాటు ఒడిశా, చత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి విజయనగరం, విశాఖ ఓడరేవుకు భారీ వాహనాలు ప్రతిరోజూ పదుల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. గ్రోత్‌సెంటర్ పరిశ్రమలకు కూడా విశాఖ ఓడరేవు, ఇతర రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. అన్ని వాహనాలు పారాది వంతెన పైనుంచి రావాల్సిందే. భారీ వాహనాలు వంతెనపైనుంచి రాకపోకలు చేయడంతో శిథిలావస్థకు చేరి కుంగిపోతోంది. వంతెన కుంగిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కుంగిన వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

విభిన్నప్రతిభావంతులకు 14న ఉపకరణాలు పంపిణీ

హాజరుకానున్న కేంద్రమంత్రి నారాయణ స్వామి

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 14న విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్టు జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వెల్లడించారు. జెడ్‌పి సమావేశ మందిరంలో బుధవారం జరిగిన జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ పథకం కింద జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక శిబిరాల ద్వారా విభిన్న ప్రతిభావంతుల అవసరాలను గతంలో గుర్తించామని తెలిపారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో ఉపకరణాల పంపిణీ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ చొరవతో మన రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ శిబిరాలు నిర్వహించామని, ఇవి విభిన్న ప్రతిభావంతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. జిల్లాలో నిర్వహించిన 7 ప్రత్యేక శిబిరాల ద్వారా 2,431 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.3.22 కోట్ల విలువైన ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్టు ఎంఎపి బెల్లాన చంద్రశేఖర్ చెప్పారు. కేంద్ర మంత్రి నారాయణస్వామి ఈ కార్యక్రమానికి హాజరు కానున్నట్టు వెల్లడించారు.

నగర అందాలు మరింత ఇనుమడింపజేసేలా..

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర అందాలను మరింత ఇనుమడింప చేసే విధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఈ మేరకు బుధవారం మయూరి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. పోలీస్, ఆర్అండ్‌బి, కార్పొరేషన్ అధికారులతో ఆ ప్రాంతమంతా కలియతిరిగారు. ట్యాంకుబండ్ రోడ్డు ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ఫౌంటెన్ల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రహదారి విస్తరణ, ట్రాఫిక్ ఐలాండ్ అభివృద్ధి చర్యలపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ మయూరి జంక్షన్ నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు రహదారి అభివృద్ధి పనులు పైడితల్లమ్మ జాతర సమయానికల్లా పూర్తి చేస్తామన్నారు. జంక్షన్లు మరింత అందంగా, ఆకర్షణీయంగా దర్శనమిచ్చేలా రూపుదిద్దుకోనున్నట్లు చెప్పారు. ఆర్అండ్‌బి డిఇ శ్రీనివాసరావు మాట్లాడుతూ 3.40 కోట్ల రూపాయలతో మయూరి జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టామన్నారు. డివైడర్ పనులు జరుగుతున్నాయని, అవి పూర్తయిన వెంటనే బిటి రహదారి వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథ్, వైసిపి నాయకులు రవిచంద్ర, యడ్ల రాజేష్, కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. దేశంలో తొలిసారిగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నామని తెలిపారు. బుధవారం నగరంలోని ఫూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 1,2,3,4,5 సచివాలయాల పరిధిలో ప్రజలు వైద్య శిబిరానికి చేరుకున్నారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, కమిషనర్ ఆర్. శ్రీ రాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, కార్పొరేటర్లు బండారు ఆనందరావు, మారోజు శ్రీనివాసరావు, వజ్రపు సత్య గౌరీ, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి: డిప్యూటీ స్పీకర్

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీస్పీకర్ స్వామి

ప్రజాశక్తి- పూసపాటిరేగ

కాస్మి ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీర భద్రస్వామీ అన్నారు. విజయనగరంలోని ధర్మపురం కూడలిలో నూతనంగా నిర్మించిన కాస్మి ఆస్పత్రిని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై సేవా దృక్పధంతో వైద్యం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు, ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల, బొబ్బిలి ఎమ్మెల్యేలు బడ్డుకొండ అప్పలనాయుడు, శంబంగి వెంకటచినప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు పతివాడ నారాయణ స్వామి నాయుడు, కోళ్ల లలితకుమారి, కెఎ నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు, పాకలపర్తి రఘు రాజు, బోనాల విజయ చంద్ర, ఎస్‌పి ఎం. దీపికా పాటిల్, టిడిపి నాయకులు సువ్వాడ రవిశేఖర్, మహంతి చిన్నంనాయుడు, కడగల ఆనంద్, కర్రోతు సత్యనారాయణ, తూర్పు కాపు రాష్ట్ర అధ్యక్షులు మామిడి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి

భోగాపురం: భోగాపురం మేజర్ పంచాయతీలో సమస్యలను పరిష్కరించాలని యువకులు గ్రామసభలో కోరారు. పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ ఉడికల అప్పయ్యమ్మ అధ్యక్షతన జరిగిన సభలో గ్రామంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని వాటిని బాగు చేయాలని యువకులు కోరారు. భట్టి కాలువ వల్ల ప్రమాదం పొంచి ఉందని రిటర్నింగ్ వాలు నిర్మించాలని గ్రామసభ దృష్టికి తీసుకువెళ్లారు. రెవెన్యూ, విద్యుత్‌తో పాటు పలు సమస్యలు గ్రామాన్ని వెంటాడుతున్నాయని వాటి పరిష్కారం దిశగా పంచాయతీ పెద్దలు, అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముఖ్యమైన సమస్యలపై గ్రామ సభలో తీర్మానం చేసి వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. గ్రామ పంచాయతీకి ఏటా వస్తున్న నిధులు ప్రాధాన్యత క్రమంలో పనులు గుర్తించి పని చేస్తే బాగుంటుందని పలువురు సభ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామం మధ్యలో నుంచి పెద్దపెద్ద వాహనాలు రావడంతో రోడ్లు పాడవడమే కాకుండా విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుత్ సౌకర్యం నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాహనాలు రాకుండా ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సభలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ నాయుడు, మాజీ ఉపసర్పంచ్ కొమ్మూరు సుభోసన రావు, సచివాల కన్వీనర్లు పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, యువకులు పల్లంట జగదీష్, పల్ల రాంబాబు, మాత నవీన్, లోకేష్ బాబు, బొల్లు త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్ ద పీపుల్ సేవలు అభినందనీయం

కొత్తవలస: ఫర్‌ద పీపుల్ సేవలు అభినందనీయమని జివిఎంసి అదనపు కమిషనర్ విశ్వనాధ్ సన్యాసిరావు అన్నారు. తుమ్మికాపల్లి గ్రామంలో వినాయక్ నగర్‌లో ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ్ హరికుమార్ ఆధ్వర్యంలో 11వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్ ది పీపుల్ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. చైర్మన్ హరికుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 40 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులు, బట్టలు, 500 మందికి అన్నదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం పలువురుకు సన్మానం, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంవిజీ ఎంటర్ ప్రైజెస్ ప్రోప్రైటర్ మురళీ వెంకట గణేష్, భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కడారి రాజు, బెహరా హాస్పిటల్స్ మార్కెటింగ్ మేనేజర్ ఎం మధుబాబు, హెర్బల్ లైఫ్ డాక్టర్ పి కిరణ్ కుమార్, ట్రస్టు సెక్రటరీ రంగుడు ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, నారా లోకేష్ యోజన అనకాపల్లి అధ్యక్షులు లక్ష్మణ్, ట్రస్ట్ సభ్యులు రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, నగేష్, గణేష్, ధర్మ, ఈశ్వరరావు, గోవిందరావు, ప్రసాద్, జగదీష్, రాజు, హరీష్, భారత్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు, బెహరా హాస్పిటల్ బృందం పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

మెరకముడిదాం: మండలంలోని బైరిపురం, బిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బొబ్బిలి డివిజన్ ఉప విద్యా శాఖధికారి బ్రహ్మాజీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యాసనా సామర్థ్యాలను, నోట్ పుస్తకాలను పరిశీలించారు. వివిధ సబ్జెక్టుల సిలబస్‌లను ఎంతవరకు అయ్యాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల దినచర్య పుస్తకాలను, వారి లెస్సన్ ప్లాన్‌లను పరిశీలించారు. అనంతరం పాఠశాల పరిసరాలను, విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ఎం. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు వంగర విద్యార్థులు

వంగర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముద్దాడ రమణమ్మ బుధవారం తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ హై జంప్ విభాగాలలో బొద్రోతు ప్రవీణ్, అచ్యుత్ కబడ్డీ, 100 మీటర్ల విభాగంలో కొమరాపు సందు, ట్రిపుల్ జంప్ విభాగంలో బొద్రోతు సౌమ్య, లాంగ్ జంప్ విభాగంలో దేవకివాడ అశోక్, త్రో బాల్ విభాగంలో చిలక సాగర్ ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపి కావడం పట్ల హెచ్ఎం రమణమ్మ విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు చక్కనైన శిక్షణ ఇస్తున్న పీడీ కవితను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూముల్లోకి దౌర్జన్యంగా వెళ్లడం దారుణం

భోగాపురం: విమానాశ్రయం అప్రోచ్ రోడ్డుకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వకుండా భూముల్లోకి దౌర్జన్యంగా వెళ్లడం చాలా దారుణమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. బుధవారం మండలంలోని బైరెడ్డి పాలెం, గూడెపు వలస, ఏ రావివలస గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా రెవెన్యూ, పోలీస్ వర్గాలు దౌర్జన్యంగా జెసిబిలతో చెట్లు తొలగించి భూములను స్వాధీనం చేసుకోవడం అన్యాయమన్నారు. ఈ అప్రోచ్ రోడ్డుకు గతంలో రైతులకు ఎకరాకు రూ.84 లక్షలు ఇస్తామని చెప్పి కోర్టులో మాత్రం రూ. 52 లక్షలు చొప్పున పరిహారం వేశారని రైతులు తమకు చెప్పారన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి విమానాశ్రయం నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పుడు 36 నెలల్లో ఎయిర్ పోర్ట్ పనులు పూర్తి చేస్తామన్నారని గడిచిన ఐదు నెలలలో కనీసం ప్రహరీ గోడ కూడా పూర్తి కాలేదని విమర్శించారు. విమానాశ్రయ నిర్మాణానికి కావలసిన భూమి ఇచ్చిన రైతులకు పరిహారం వేసి వారి సమస్యలపై స్పందించాలని తహశీల్దార్ బంగార్రాజుకు ఆయన వినతిపత్రం అందజేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుర్ల: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. గుర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గరివిడి మండలం గెడ్డపువలస గ్రామానికి చెందిన విఆర్ఎ దమరసింగి రాము (52) గుర్ల నుండి విజయనగరం వెళ్ళేందుకు గుర్లలో రోడ్డు పక్కన నిలబడి ఉన్నాడు. అతనిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీ కొట్టి వెళ్లిపోయిన వాహనాన్ని తగరపువలసలో గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ హరిబాబు నాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామభద్రపురం: మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన ఏనుగుతల చిన్నారావు(48) పురుగుమందు తాగి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. చిన్నారావుకు ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు గతేడాది ప్రమాదంలో చనిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో పాటు అప్పుల బాధలు తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది ఈ నెల 2న గడ్డి మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన కుటుంబసభ్యులు బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడ నుంచి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని అతని బార్య లక్ష్మి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఆలయ ప్రాంగణంలో పడకేసిన పారిశుద్ధ్యం

- ఆది, మంగళ వారాల్లో వేల సంఖ్యలో భక్తులు

- అసౌకర్యాల నడుమ అవస్థలు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు కొట్టం కోటమ్మ తల్లి ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఆలయ దర్శనం నిమిత్తం వచ్చిన భక్తులకు సౌకర్యాలు కరువయ్యాయి. కొట్టం కోటమ్మతల్లిని దర్శించుకునేందుకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా భక్తులు వస్తుంటారు. భక్తులు కానుకల రూపంలో అమ్మవారికి అధిక ఆదాయం వస్తుంది. అయినా ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమ్మవారి దర్శనం, మొక్కులు తీర్చుకునే నిమిత్తం ప్రతి ఆది, మంగళ వారాలు భక్తులు వేల సంఖ్యలో ఆలయానికి వస్తూ ఉంటారు. భక్తులు కనీస అవసరాల నిమిత్తంగా ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. వీటికి తోడు చుట్టు పక్కల పరిసరాలు చెత్తా చెదారాలతో నిండి వర్షం కురిసినప్పుడు దుర్గంధం వెదజల్లుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. అధికారులకు భక్తుల నుండి కానుకల రూపంలో వచ్చే ఆదాయం మీద ఉన్న శ్రద్ధ ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేయడంలోనూ, భక్తులకు సౌకర్యాలు కల్పించడంలోనూ లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకమండలితో పాటు అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అపారిశుద్ధ్యం నడుమ తాగునీటి బోరు

వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయానికి ఇప్పుడు మరుగుదొడ్లు నిర్మించారంటే భక్తుల మీద ఎంత అశ్రద్ధ వహిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. కోట్ల ఆదాయం వస్తున్న అమ్మవారికి కోనేరు ఉండేదని స్థానికులు చెబుతున్నారు. దేవాదాయ శాఖ ఇకనైనా స్పందించి అమ్మవారి దేవాదాయ భూములను కోనేరును రక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఆడవాళ్లకు తప్పని పాట్లు

అమ్మవారి దేవాలయం వద్ద నేటి వరకు కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా కల్పించలేదు. ఇటీవల నూతనంగా మరుగుదొడ్లు నిర్మించినప్పటికీ వాటిని ప్రారంభించకుండా తాళాలు వేసి ఉంచారు. ఈ అమ్మవారి ఆలయం వద్ద ఆడవారికి సౌకర్యాలు లేవనే చెప్పాలి.

మేడ శెట్టి సింహాచలం, గ్రామస్తురాలు, శృంగవరపుకోట

పరిసరాలను శుభ్రం చేయిస్తా

ఆలయ పరిసరాలు దుర్గంధంగా ఉన్నమాట వాస్తవమే. కానీ వాటిని శుభ్రం చేయిస్తాం. మరుగుదొడ్లను నూతనంగా నిర్మించాం. మంగళ, ఆదివారాలలో వాటిని భక్తులు వినియోగించు కునేందుకు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతానికి వాడుక నీటికి ఇబ్బందులేదు.

ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగేంద్ర

రాష్ట్రం దాటిన గ్రామ వాలంటీర్ సేవలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠరాజుపురం గ్రామానికి చెందిన కరక శివశంకర్ ప్రసాద్ (15) తలసేమియా వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని రిలా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఈ బాలుడుకు ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 10వేలు పింఛను డబ్బును గ్రామ వాలంటీర్ వంటాకు నాయుడు చెన్నై వెళ్లి బుధవారం అందించారు. వాస్తవానికి వాలంటీర్ వికలాంగుడైనప్పటికీ తన సొంత ఖర్చుతో మన రాష్ట్రం దాటి చెన్నై వెళ్లి పింఛను అందించడంతో గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పింఛను అందిస్తున్న వాలంటీర్ నాయుడు

ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జామి

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ఉచిత వైద్య సేవలు ప్రభుత్వం అందిస్తుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని జడ్డేటివలస సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలోనే మెరుగైన ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారికి అందరూ అండగా నిలవాలని కోరారు. అనంతరం వైద్యులతో మాట్లాడి ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవి, ఎంపిపి సబ్బవరపు అరుణ, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, నాగమణి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

కొత్తవలస: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు ఎంతగానో దోహద పడుతుందని, ఈ అవకాశం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం కంటకాపల్లి గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్య చికిత్స చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, గ్రామ సర్పంచ్ మదిన లక్ష్మి, డాక్టర్ సీతల్ వర్మ, మదిన అప్పలరాం, వైస్ ప్రెసిడెంట్ బొదల సుధాకర్, పిఎస్ఎన్ పాత్రుడు, మదిన ప్రకాష్, మేలాస్త్రి అప్పారావు, ఎంపిడిఒ వై. పద్మజ, పంచాయతీ కార్యదర్శి మాధవీలత, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. మండలంలోని సంతగైరమ్మపేట గ్రామ సచివాలయం వద్ద బుధవారం ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంపూర్ణ పౌష్టికాహారాన్ని పరిశీలించారు. వైద్య శిబిరానికి వచ్చిన పలువురు వయోవృద్ధులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, సర్పంచ్ గోగాడ కళావతి, ఎంపిటిసి కూనిరెడ్డి శ్రీదేవి, నాయకులు రవిరాఘవరావు, గోగాడ అప్పారావు, గోగాడ శ్రీనివాసరావు, చలుమూరి దేముడు, గోగాడ ఈశ్వరరావు, గోగాడ కృష్ణంనాయుడు, పంచాయితీ విస్తరణాధికారి లక్ష్మి, వైద్యాధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ, ఐసిడిఎస్, వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: షుగర్ టెస్టు చేసుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

తెర్లాం: మండలంలోని గంగన్న పాడు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ క్యాంపులో అంగన్వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆరు రకాల దినుసులతో 20 రకాల వంటకాలను తయారు చేసి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్ రామకృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ భాస్కరరావు, వైస్ ఎంపిపి, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సచివాలయ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని సింగవరం పాఠశాల వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 457 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, వైస్ ఎంపిపి తమ్మినాయుడు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఆదిలక్ష్మి, ప్రత్యేకాధికారి జమదగ్ని, సర్పంచ్ పి. అప్పారావు, ఉప సర్పంచ్ గురువులు, నాయకులు బి. రమణ, కృష్ణ, లెంక అప్పలనాయుడు, సచివాలయ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని గవర్నమెంట్ హై స్కూల్లో (సికెఎం) బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, నగర పంచాయతి కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, వివిధ బోర్డుల డైరెక్టర్లు, వైద్య, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొనారు.

టిడిపి దీక్షలకు మెకానిక్‌ల మద్దతు

ప్రజాశక్తి - బొబ్బిలి

చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా పట్టణంలో టిడిపి చేపట్టిన దీక్షలకు ద్విచక్ర వాహన మెకానిక్స్ బుధవారం మద్దతు ప్రకటించారు. 22వ రోజు దీక్షలతో మెకానిక్స్ కూర్చుని సంఘీభావం ప్రకటించారు. దీక్షలను టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్, వి.సత్యనారాయణ ప్రారంభించారు. చంద్రబాబు అరెస్టును మెకానిక్స్ అసోసియేషన్ సభ్యులు వి.మహేష్, కె.చంద్రశేఖర్, కె.వాసు ఖండించారు.

శృంగవరపుకోట : మండల కేంద్రంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు బుధవారం కొనసాగాయి. ఈ దీక్షల్లో టిడిపి నియోజకవర్గ మహిళ అధ్యక్షులు గుమ్మడి భారతి, వేపాడ మహిళా సంఘాల అవేర్నెస్ అధ్యక్షులు గొంప తులసి, సింగరాయి, ఆతవ, ఏఎస్ పేట, కరకవలస, బాణాది, బల్లంకి, డిఆర్‌పేట టిడిపి నాయకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. నియోజకవర్గ ఇంఛార్జి కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట, పుణ్యగిరి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద బాబుతో నేను 22వ రోజు చేపట్టిన దీక్షలో నియోజకవర్గంలోని 400 మంది టిడిపి తెలుగు మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని చంద్రబాబుకు మద్దతుగా సంతకాలు చేశారు. బాబుతో నేను సైతం అంటూ నల్ల బ్యాడ్జీలు ధరించి, సంఘీభావం తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

డెంకాడ : డెంకాడ గ్రామంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా టిడిపి నాయకులు ఇంటిఇంటికి వెళ్లి బుధవారం కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, నాయకులు పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్ రావు, కలిదిండి పాణీరాజు, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, పడాల చిన్నారావు, కాగితాల బాలు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు వ్యతిరేకంగా బుధవారం టిడిపి ఆధ్వర్యాన వినూత్న రీతిలో నిరసనలు చేపట్టారు. చింతపల్లి సముద్ర తీర ప్రాంతంలో 'ఐయామ్ విత్ సిబిఎన్' అని ఇసుకతో చెక్కి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి విజయనగరం మండల అధ్యక్షులు బి.నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలి నాయుడు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి తుంపిల్ రమణ, రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ మాడిమి దేవేంద్రనాథ్, దాట్ల రవిరాజు, మాజీ కౌన్సిలర్ కెల్ల సూరిబాబు, సురేంద్ర, మాడుగుల భాను, కొట్యాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పారిశుధ్య విభాగంలో కాంట్రాక్ట్ కార్మికురాలుగా పనిచేస్తూ 2021 అక్టోబర్ 6న అనారోగ్యంతో మరణించిన తుపాకుల రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు జగన్మోహన్‌రావు కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో నగర పంచాయతీ చైర్మన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లకి బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఏ. జగన్మోహన్ రావు మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా తుపాకుల రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అడుగు తుంటే జీవో లేదని అధికారులు దాటవేస్తున్నారన్నారు. పర్మినెంట్ కార్మికులకు ఉన్న జీవో ఆధారంగా మానవతా దృక్పథంతో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, బొబ్బిలి తదితర చోట్ల స్థానిక ఎమ్మెల్యేలు, కౌన్సిల్ ఆమోదంతో కాంట్రాక్ట్ కార్మికులకు కూడా కారుణ్య నియమాకాలు చేపడుతున్నారని నెల్లిమర్లలో కూడా ఆ విధంగా కౌన్సిల్ తీర్మానించి ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు సహకారంతో తుపాకుల రవణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అనంతరం చైర్మన్ స్పందిస్తూ రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వటానికి కౌన్సిల్ సానుకూలంగా ఉందని, ఎమ్మెల్యేతో మాట్లాడిన తర్వాతనే మీకు హామీ ఇవ్వగలమని చెప్పారు. వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ కార్మికులుగా మీరు, కౌన్సిల్ గా మేము తుపాకుల రవణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చే విధంగా ప్రయత్నం చేద్దామని, ఇప్పటికే ఎక్కడైనా ఉద్యోగాలు ఇచ్చి ఉంటే ఆధారాలతో ఎమ్మెల్యేను కలవాలని సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బాబురావు, దుర్గారావు, హరిబాబు తదితరులున్నారు.


వినతి పత్రాన్ని అందిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

వంతెన బాగు చేసేందుకు చర్యలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- బొబ్బిలి

పారాది వంతెన బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. కుంగిపోయిన వంతెనను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన వంతెన కావడంతో భారీ వాహనాలు వెళ్లడం వల్ల కుంగిపోయిందన్నారు. బ్రిటిష్ కాలంలో 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వంతెన నిర్మించారని, పెరుగుతున్న అవసరాలు రీత్యా 50 నుంచి 60 మెట్రిక్ టన్నుల బరువుతో వాహనాలు వెళ్లడంతో వంతెన కుంగిపోయిందన్నారు. నూతన వంతెనకు నిధులు మంజూరైనప్పటికి పనులు ప్రారంభం కాలేదన్నారు. ప్రభుత్వంతో చర్చించి నూతన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని, పాత వంతెన బాగు చేసేందుకు అధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఆర్ అండ్ బి అధికారులు ఉన్నారు.

వంతెన నిర్మాణంలో ప్రభుత్వం విఫలం

పారాది వంతెన నిర్మాణంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. వంతెన నిర్మాణంలో ప్రభుత్వ వైఫల్యంపై ఆయన బుధవారం ఒక వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారాది వంతెన నిర్మాణానికి టిడిపి హయాంలో నిధులు మంజూరై పనులకు అప్పటిలో శంకుస్థాపన చేసినప్పటికీ ఎన్నికల అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంతెన నిర్మాణం పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. వంతెన బాగు చేసేందుకు రూ.40లక్షలు ఖర్చు చేసినప్పటికీ నాసిరకం పనులు వల్ల వంతెన కుంగిపోతుందని విమర్శించారు. వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంతో నేడు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని, పాత వంతెన బాగు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు వంతెన పరిశీలన

పారాది వంతెనను గురువారం పరిశీలిస్తామని బేబినాయన చెప్పారు. వంతెన పరిశీలనకు ఉదయం 10గంటలకు పారాది వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

పారాది వంతెనను బాగుచేయండి

కూలేందుకు సిద్ధంగా ఉన్న పారాది వంతెనను తక్షణమే బాగుచేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు, పిసిసి మెంబర్ మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పారాది గ్రామం దగ్గర వేగావతి నదిపై వంతెన నిర్మించి దాదాపు 90 సంవత్సరాలు అవుతుందని, గత 15 సంవత్సరాలుగా అక్కడక్కడా బీటలు వారితే రెండుసార్లు రోడ్డు బాగు చేశారని వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత పట్టించుకోలేదని అన్నారు. పురాతనమైనటువంటి ఈ బ్రిడ్జి ఏ క్షణంలోనైనా కూలిపోయే పరిస్థితి ఉందని వెంటనే అధికారులు, ప్రభుత్వం స్పందించి వంతెనను బాగు చేయాలని డిమాండ్ చేశారు. ఈ వంతెన పై విజయనగరం నుంచి రామభద్రపురం మీదుగా బొబ్బిలి, పార్వతీపురం, ఒడిశా వెళ్లే ప్రయాణికులు ప్రయాణించ డానికే భయపడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు మండపాక శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేధింపుల పట్ల అప్రమత్తం : డిఎస్‌పి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు సమాజంలో జరుగుతున్న దాడులు, వేధింపులు పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి టి. గోవిందరావు సూచించారు. బుధవారం మొయిద జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎస్ఐ పి.నారాయణరావు ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మహిళల పై జరుగుతున్న దాడుల, సైబర్ నేరాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ సమాజంలో మహిళల పై జరుగుతున్న దాడులు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు వినియోగం వల్ల జరిగే అనర్థాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి మార్గంలో నడిచి సమాజానికి ఉపయోగ పడాలని మహిళలూ, బాలికల పట్ల జరుగుతున్న దాడులు ధైర్యంగా ఎదిరించి నిలబడాలని అన్నారు. సైబర్ నేరాల గురించి తెలుసుకొని మోసానికి గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

నెల్లిమర్ల: మాట్లాడుతున్న డిఎస్‌పి గోవిందరావు

తెర్లాం: మండలంలోని నెమలం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు ఎస్ఐ ఆర్ రమేస్ బుధవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్కూల్లో ర్యాగింగ్‌కు ఎవరూ పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొబైల్ ఫోన్లు వాడకుండా సోషల్ మీడియా ఫాలో అవ్వకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE VIZIANAGARAM GUARDIAN O.P. 23 /2023

Between:
Jinnala Venkatesh .....Petitioner
AND:
NIL ....Respondents

GENERAL NOTICE

To,
The General Public who may concern,

General Public are hereby informed that the above petitioner Jinnala Venkatesh filed above G.O.P. praying the Honourable Court to appoint him as guardian and next friend to his younger sister Jinnala Keerthana and to accord permission to see her welfare in all aspects. The above matter is posted to **Dated 10-10-2023**, for appearance and to file objections on the above date at **10-30 A.M.** before the above said Honourable Court and if any one have any objections they can file their objections before the Honourable Court on the above said date and time, else the matter will be decided on the material available on record.

By Order of the Hon'ble Court

I. RAMESH
Advocate for the Petitioner
Vizianagaram

Date: 4-10-2023
Vizianagaram

In the Hon'ble Court of the Senior Civil Judge at Vizianagaram
E.P. 62/2019 OS 1050/2011

Between:
V.V.Kiran ...DHr/Plaintiff
And:
Kutcharlapati Vijaya Laxmi ....JDr/Defendant

To
Sri Kutcharlapati Vijaya Laxmi, W/o Prasad Raju, Residing at House Opp. Vizzi Stadium, Near Babametta, Vizianagaram. ....JDr

NOTICE

The above named DHr filed this E.P. 62/2019 in O.S.1050/2011 for recovery of Decree Amount. The Hon'ble Court Posted the Matter on 16-10-2023 for your appearance before the Hon'ble Court. Therefore please take notice that you shall appear before the Hon'ble Court on **16-10-2023 at 10-30 AM** personally or by any otherwised agent, Failing which the Hon'ble Court may be passed exparty orders.

V.R.Reddy
Advocate for the DHr/Plaintiff
Vizianagaram

Date: 4-10-2023
Vizianagaram

Between
Karaka Anuradha ....Petitioner/Plaintiff
AND:
Karaka Srinivasa Rao and others ......Respondents/Defendants

To,
R-6) Siriki Lakshmi D/o late Karaka Satyam Dr. No. 1-74, Main Road, Near Anjaneyaswamy Temple Denkada Village & Mandal
R-7) Choppa Devi, D/o late Karaka Satyam Dr. No. 1-74, Main Road Near Anjaneyaswamy Temple Denkada Village & Mandal
R-9) Karaka Gopi, S/o late Satyam, Dr. No. 1-74, Main Road, Near Anjaneyaswamy Temple Denkada Village & Mandal
R-11) Koyineni Suri Babu, S/o late Naram Naidu, Dr. No. 4-108, Main Road, Near Anjaneyaswamy Temple Denkada Village & Mandal

Where as, the above named Petitioner has instituted the above petition against you for addiding as Legal Heirs of the deceased Karaka Satyam and Koyaneni Naram Naidu. You are hereby summoned to appear in the above Court in person or by a pleader, duly instructed and able to answer all material questions relating to the petition who shall be accompanied by some person able to answer all such questions on the **11th Day of OCTOBER, 2023, at 10-30 A.M.** to answer the claim and further you are hereby directed to file within 30 days of service of summons a written counter of your defence and to produce on the said day all documents in your possession or power upon which you base your defence, else the matter will be heard and determined in your absence.

By Order of the Honourable Court

I. RAMESH
Advocate for the Petitioner
Vizianagaram